
సాక్షి
చిత్తూరు
ఆదివారం । 25 । జూన్ । 2023



హాయ్ ఏపీ.. బైబై బీపీ!
పవన్ ఎక్కడకు వెళ్లినా బైబై చెప్పమంటున్నారని. ప్రజలు ఆయనలా పూటకోమాట మార్చేవారు కాదని మంత్రి రోజా అన్నారు. - 8లో



చిట్స్ వ్యాపారి పరారీ
పదేళ్ల పాటు చిట్స్ నిర్వహించిన వ్యాపారి రూ.కోటితో పరారైన సంఘటన గంగవరం మండలంలో వెలుగుచూసింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	26
తిరుపతి	35	26
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	37	27

న్యూస్‌రీల్

ఉత్తమ స్పోర్ట్స్ చైర్‌పర్సన్‌గా మహమ్మదాలీ



అవార్డు అందుకుంటున్న మహమ్మదాలీ

పులిచెర్ల(కల్లూరు): అంతర్జాతీయ లయన్స్ సంస్థ ప్రతి ఏటా ఇచ్చే అవార్డుల్లో భాగంగా ఈ ఏడాది కల్లూరుకు చెందిన లయన్ మహమ్మదాలీకి ఉత్తమ స్పోర్ట్స్ చైర్‌పర్సన్ అవార్డు ఇచ్చినట్లు తెలిపారు. బెంగళూరులో కల్చరల్ ఆర్ట్స్ అకాడమీలో గవర్నర్ లయన్ వినుతా ప్రకాష్ చేతుల మీదుగా ఈ అవార్డు శనివారం అందజేశారు. ఉత్తమ రూరల్ క్లబ్‌గా కల్లూరు క్లబ్ అవార్డును గెలుచుకొంది.

పరీక్ష రుసుం చెల్లించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో డీఎల్‌ఈడీ మూడో సెమిస్టర్ (2021–23) బ్యాచ్ విద్యార్థులు పరీక్ష రుసుం చెల్లించాలని డీఈవో విజయేంద్రరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధరుసుం లేకుండా జూలై 6లోపు, రూ.50 అపరాధ రుసుంతో 13లోపు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

డీఎంహెచ్‌ఓగా ప్రభావతి

చిత్తూరు రూరల్: జిల్లా డీఎంఅండ్‌హెచ్‌గా ప్రభావతి దేవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈమె నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఐఓగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న జి ప్రకాశంను ఆ శాఖకు సరెండర్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీబీ అధికారిగా వెంకటప్రసాద్



చిత్తూరు రూరల్: జిల్లా క్షయ నివారణ అధికారిగా వెంకట ప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నెల్లూరు జిల్లాలో టీబీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారిగా పని చేస్తున్నారు. శుక్రవారం ఈయన్ను జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వైద్యవిధాన పరిషత్‌లో బదిలీలు

చిత్తూరు రూరల్: జిల్లా వైద్య విధాన పరిషత్‌లోని పలు విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందిని శనివారం వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. స్టాఫ్ నర్సులు 143, హెడ్‌నర్సులు 10, డాక్టర్లు 21, రేడియోగ్రాఫర్లు 03, ఫార్మసీ సూపర్‌వైజర్లు 01, జూనియర్ అసిస్టెంట్ ఒకరిని బదిలీ చేశారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు

చిత్తూరు కలెక్టరేట్ : యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్తంగా హెచ్‌సీఎల్ టెక్‌బీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 28న నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించే సమావేశానికి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇతర వివరాలకు 63630 95030, 83744 21195ను సంప్రదించాలని తెలిపారు.

రిజిస్ట్రేషన్ ఉప జిల్లాల ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్ : నూతన రిజిస్ట్రేషన్ ఉప జిల్లాలను ఏర్పాటు చేస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. తిరుపతి జిల్లా పరిధిలో ప్రస్తుత పాకాల సబ్ జిల్లా పరిధిలోని చింతపెంట, చిటిపిరాళ్ల సచివాలయాలు, పిచ్చాటూరు పరిధిలోని అగరం, వెంకటగిరి పరిధిలోని ఉప్పరపల్లి, చెలికంపాడు, సాలికాలనీ, పావమాంబపురం, చిత్తూరు జిల్లా పరిధిలో చిత్తూరు రిజిస్ట్రార్ ఆఫీస్ పరిధిలోని మరకాలకుప్పం, పట్రపల్లి, తెల్లరాళ్లపల్లి, యాదమరి, పలమనేరు పరిధిలోని చామనేరు, కుప్పం పరిధిలోని సోడిగానిపల్లి, నగరి పరిధిలోని తేరని, మిట్టపాళ్యం సచివాలయాలను ఉప జిల్లా కార్యాలయాలుగా గుర్తిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

బాబు ద్రోహం.. తీరని దాహం

- పడమటి ప్రాంతాల్లో రూ.1,200 కోట్లతో మూడు భారీ ప్రాజెక్టులు
- 35 వేల ఎకరాలకు సాగు, 6 నియోజకవర్గాలకు తాగునీరే లక్ష్యం
- ఆయా ప్రాజెక్టులపై టీడీపీ విషప్రచారం
- హఠాత్తుగా ఆగిన ప్రాజెక్టుల నిర్మాణం
- విస్మయం వ్యక్తం చేస్తున్న స్థానిక జనం

పుంగనూరు నియోజకవర్గం, సోమల మండలంలో నిర్మిస్తున్న ఆవులపల్లె ప్రాజెక్టు



పుంగనూరు మండలం, నేతిగుట్లపల్లె వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టు



సాక్షి, చిత్తూరు/ పుంగనూరు: పుంగనూరుతోపాటు సమీప పడమటి నియోజకవర్గాల్లో చుక్క నీరు లేదు. దశాబ్దాల కాలం తాగు, సాగునీటి కోసం రైతాంగం పడని పాట్లు లేవు. నాడు జమీందారులు తవ్విన చెరువులపైనే ఆధారపడి జీవించాల్సిన పరిస్థితి. నదుల ఆధారం లేని ఈ ప్రాంతాలకు వందల మైళ్ల దూరంలోని కృష్ణమ్మ జలాలు తీసుకొచ్చి శాశ్వతంగా ప్రజల దాహంతోపాటు వేలాది ఎకరాలకు సాగునీరు అందించాలని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సంకల్పించారు. ఇదే విషయాన్ని నాడు ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. అధికారంలోకి రాగానే రూ.1,200 కోట్ల అంచనాలతో మూడు భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో ఓ ప్రాజెక్టు పూర్తవగా మరో రెండు ప్రాజెక్టుల పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి.

జలంపై బాబు గరళం

చిత్తూరు జిల్లా వాసిగా 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు పనిచేశారు. 9 సార్లు ఎమ్మెల్యేగా, 15 సంవత్సరాలు ప్రతిపక్ష నేతగా కొనసాగారు. కానీ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పాన్ని కూడా పట్టించుకోలేదు. పడమటి ప్రాంతాల్లో శాశ్వత నీటి ప్రాజెక్టులు నెలకొల్పడానికి శ్రద్ధ చూపలేదు. కనీసం నాడు జమీందారులు తవ్వించిన చెరువుల్లో పూడికతీత పనులు కూడా చేయలేదు. నీరు–చెట్టు పథకం కింద జన్మభూమి కమిటీ సభ్యులు, పచ్చనేతలకు రూ.కోట్లు కుమ్మరించి జేబులు నింపే ప్రయత్నం చేశారు తప్ప జనానికి ఒరగబెట్టింది లేదు. ప్రస్తుతం తాను ముఖ్యమంత్రిగా చేయలేని శాశ్వత పనులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం చేయడాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేకపోయారు. పచ్చనేతల ద్వారా కుట్రలకు తెరదీసి గ్రీన్ ట్రిబ్యునల్‌లో తప్పుడు కేసులు వేయించారు. అప్పై ప్రాజెక్టు నిర్మాణ పనులు ముందుకు సాగకుండా స్టే వచ్చేలా కుట్రలకు తెరలేపారు. దీనిపై కుప్పంతోపాటు పలమనేరు, తంబళ్లపల్లె, పుంగనూరు, మదనపల్లె, పీలేరు ప్రజలు మండిపడుతున్నారు.

కుట్రలు, కుతంత్రాలకు మారు పేరు చంద్రబాబు. వెన్నుపోటు రాజకీయాలు ఆయనకు వెన్నతోపెట్టిన విద్య. ప్రజలకు మంచి చేస్తే ఎన్నటికీ ఆయన ఓర్చుకోలేరు. ఎక్కడ తన పేరు మరుగున పడుతుందో నని కుట్ర రాజకీయాలకు తెర లేపుతారు. మంచిని చెడుగా.. చెడును మంచిగా నమ్మించే ప్రయత్నం చేస్తారు. ఇలాంటిదే ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి నియోజకవర్గాల్లో చోటుచేసుకుంది. తాను చేయలేని పని సీఎం వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం చేస్తోందని ఓర్చుకోలేకపోయారు. కరువును తరిమేలా.. చేపట్టిన మహా జలయజ్ఞాన్ని నీరుగార్చారు. సాగు–తాగునీరు పుష్కలంగా అందేలా నిర్మిస్తున్న మూడు ప్రాజెక్టులపై తన అనుచరులతో కేసులు వేయించి పనులు అడ్డుకున్నారు. దీనిపై స్థానికులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.



తంబళ్లపల్లె నియోజకవర్గం ముదివేడులో నిర్మిస్తున్న ప్రాజెక్టు

కరువు నేలపై 'పెద్ద'మనసు!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతాల అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారు. బీడువారి..మోడుబారిన పొలాలను సస్యశ్యామలం చేయాలని సంకల్పించారు. ప్రజాసంకల్ప యాత్రలో నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చే దిశగా అడుగులు వేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యలు వివరించారు. పుంగనూరుతోపాటు చుట్టుపక్కల నియోజవర్గాల్లో ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రణాళిక రచించారు. తంబళ్లపల్లె, పుంగనూరులో రూ.1,200 కోట్ల వ్యయంతో.. 6.5 టీఎంసీల సామర్థ్యంతో మూడు ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

గండికోట నీరు కుప్పానికి

నూతనంగా నిర్మిస్తున్న ముదివేడు, నేతిగుట్లపల్లె, ఆవులపల్లె ప్రాజెక్టులకు హంద్రీ–నీవా నీటిని అనుసంధానం చేసేలా పనులు సాగుతున్నాయి. వీటితోపాటు పులివెందుల నియోజకవర్గంలోని గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్ ద్వారా ఈ కొత్త ప్రాజెక్టులకు అనుసంధానం చేయనున్నారు. ఈ నీటిని తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, పలమనేరు, కుప్పం వరకు తరలించాలని నిర్ణయించారు. దీనిద్వారా సుమారు 30 వేల ఎకరాలకు సాగునీరు, పడమటి నియోజకవర్గాల్లో ఇంటింటికీ తాగునీరు అందించాలని భావిస్తున్నారు.

ముదివేడు ప్రాజెక్టు (తంబళ్లపల్లె)
అంచనా వ్యయం : రూ.250 కోట్లు
నిర్మాణం: ముదివేడు గ్రామ సమీపంలో 500 ఎకరాల విస్తీర్ణంలో
పరిధి: 3కి.మీ
నీటి నిల్వ సామర్థ్యం : 1.5 టీఎంసీలు
సాగునీరు : 10 వేల ఎకరాలు
తాగునీరు : తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలకు
ప్రస్తుత ప్రాజెక్టు దశ : పనులు దాదాపు పూర్తి

ఆవులపల్లె ప్రాజెక్టు (పుంగనూరు)
అంచనా వ్యయం : రూ.600 కోట్లు
నిర్మాణం : సీతమ్మ చెరువు, సోమల మండలం, పుంగనూరు నియోజకవర్గం, 1,525.20 ఎకరాల విస్తీర్ణంలో..
పరిధి : 10 కి.మీ
నీటినిల్వ సామర్థ్యం: 3.5 టీఎంసీలు
సాగునీరు: 15 వేల ఎకరాలు
తాగునీరు : పుంగనూరు, పీలేరు, చంద్రగిరి
ప్రస్తుత ప్రాజెక్టు దశ : సగం పనులు పూర్తి

నేతిగుట్లపల్లె ప్రాజెక్టు (పుంగనూరు)
అంచనా వ్యయం : రూ.300 కోట్లు
నిర్మాణం: నేతిగుట్లపల్లె గ్రామం, పుంగనూరు మండలం, 827.23 ఎకరాల విస్తీర్ణంలో..
పరిధి : 6 కి.మీ
నీటి నిల్వ సామర్థ్యం : 1 టీఎంసీ
సాగునీరు: 10 వేల ఎకరాలు
తాగునీరు: పుంగనూరు, మదనపల్లె, పలమనేరు, కుప్పం
ప్రస్తుతం ప్రాజెక్టు దశ - నిర్మాణం పూర్తి

కుప్పం ప్రజలకూ నీరందిస్తాం



30 ఏళ్లుగా ప్రభుత్వాలు పడమట నియోజకవర్గాలకు తాగునీరు అందించడంలో విఫలమయ్యాయి. కరువు నేలకు తాగునీరు, సాగు నీరు ఇవ్వాలని సీఎం జగన్ నిర్ణయించారు. జనం కోసం మూడు ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాయి. వర్షపునీటితోపాటు హంద్రీ–నీవా, సుజల–స్రవంతి కాలువల ద్వారా నీటిని అనుసంధానం చేయాలని సంకల్పించాం. అలాగే, గండికోట రిజర్వాయర్ ద్వారా కృష్ణా జలాలు కూడా రిజర్వాయర్లకు అనుసంధానం చేసి చంద్రబాబు ఎమ్మెల్యేగా ఉన్న కుప్పానికి కూడా నీరు అందించేలా బృహత్తర ప్రణాళికలు రూపొందించాం. కానీ మంచి పనులు చంద్రబాబు ఎన్నటికీ సహించరు. తన అనుచరులతో కోర్టుల్లో తప్పుడు కేసులు దాఖలు చేయించి స్టేలు తెచ్చి పనులు అడ్డుకున్నారు. వాస్తవాలను సుప్రీంకోర్టుకు నివేదిస్తాం. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రాజెక్టులు నిర్మించి తీరుతాం.
– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పర్యావరణ, అటవీశాఖ మంత్రి

నీటి ప్రాజెక్టుల్లోనూ రాజకీయమా?



రైతులకు మేలు చేసే ప్రాజెక్టుల నిర్మాణాన్ని టీడీపీ నాయకులు అడ్డుకోవడం తగదు. గతంలో నీటి సౌకర్యం లేక పంటల సాగుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోంది. వీటిని అడ్డుకోవడం టీడీపీ నాయకులకు తగదు
– సుబ్రహ్మణ్యంరెడ్డి, జోగివారిపల్లి, సదుం

ప్రాజెక్టులుంటే మూడు పంటలు సాగుచేస్తాం



కరువు కాటకాలతో నీరులేక పొలాలు బీటలు వారాయి. ఈ తరుణంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతిగుట్లపల్లె ప్రాజెక్టును అత్యంత వేగవంతంగా నిర్మించారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే మేము మూడు పంటలు పండించేందుకు వీలుంది. ఇలాంటి రిజర్వాయర్ల నిర్మాణాన్ని తెలుగుదేశం నాయకులు అడ్డుకోవడం బాధాకరం.
– రామకృష్ణారెడ్డి, రైతు, ఈడిగపల్లె, పుంగనూరు మండలం

చంద్రబాబు నీచబుద్ధితోనే..



పుంగనూరులో నీరు లేక చక్కెర ఫ్యాక్టరీ మూతపడింది. అభివృద్ధికి నీరు ఎంతో అవసరం. సీఎం జగనన్న ఆశీస్సులతో మూడు రిజర్వాయర్లు నిర్మించి 6.50 టీఎంసీల నీటిని నిల్వ చేసి పడమటి నియోజకవర్గాలకు సాగు–తాగునీరు అందించే కార్యక్రమం చేపట్టాం. చంద్రబాబునాయుడు నీచబుద్ధితో పనులు ఆపించారు. అవసరమైతే ప్రాజెక్టుల నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ వారు ముందుకొస్తే ముఖ్యమంత్రితో చర్చించి పనులు వారికే కేటాయిస్తాం. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ప్రాజెక్టుల నిర్మాణం చేసి తీరుతాం.
– పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

జగన్ సుపరిపాలన దేశానికే ఆదర్శం

- ఇంటింటికీ నవరత్న ఫలాలు
- నాడు–నేడుతో బలమైన భవిష్యత్తు
- త్వరలో చిగురుకుంట గనులు ప్రారంభిస్తాం
- పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



గుడుపల్లె సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



గజమాలతో మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

కుప్పం/గుడుపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గుడుపల్లె మండలంలో ఆయన చేపడుతున్న పల్లెబాటలో శనివారం సోడిగానిపల్లి, చీకటిపల్లి, సంగనపల్లి, గొల్లపల్లి, కొడతనపల్లి, కుప్పిగానిపల్లి, గుడుపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఆయా సభల్లో ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. నవరత్నాల పథకాలు ప్రవేశపెట్టడం ద్వారా ముఖ్యమంత్రి దేశానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఇందులో ముఖ్యంగా నాడు–నేడు, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన వంటి పథకాలతో ముఖ్యమంత్రి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. ఆరోగ్య శ్రీ పేరు చెబితే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తుకు వస్తారని చెప్పారు. అదే విధంగా సచివాలయ వ్యవస్థ పేరు చెబితే భవిష్యత్తులో జగన్‌మోహన్‌రెడ్డే గుర్తొస్తారని పేర్కొన్నారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు చెప్పుకోవడానికి ఒక్క పథకమూ లేకపోయిందన్నారు. కుప్పం జనం ఇప్పటికైనా ఆలోచన చేయాలని సూచించారు. సీఎం జగన్ మేనిఫెస్టోను ఒక భగవద్గీతలా భావించారని చెప్పారు. అదే చంద్రబాబు 600 హామీలు ఇచ్చి గెలిచిన తరువాత విస్మరించడం ప్రజలందరికీ గుర్తుందని చెప్పారు.

త్వరలో చిగురుకుంట గనులు ప్రారంభిస్తాం

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చిగురుకుంట బంగారు గనులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి వెల్లడించారు. ఇప్పటికే టెండర్లను దక్కించుకున్న ఎన్ఎండీసీ సంస్థ సర్వేలు సైతం పూర్తి చేసినట్లు చెప్పారు. త్వరలోనే గనులు ప్రారంభించి, 3 వేల మందికి స్థానికంగా ఉపాధి అందిస్తామన్నారు.

అభివృద్ధికి కట్టుబడిన సీఎం

కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. పాత మున్సిపాలిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన వలంటీర్ల సత్కారం కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, కుప్పం మున్సిపాలిటీకి ఇది వరకే రూ.66 కోట్లు కేటాయించామని, మరిన్ని నిధులు కేటాయించే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు చెప్పారు. స్వచ్ఛ సంకల్ప్‌లో భాగంగా 8 ఈ ఆటోలను ప్రారంభించారు. ఈ సమావేశంలో సేవావజ్ర అవార్డును కుప్పం పట్టణానికి చెందిన వలంటీరు గాయత్రికి అందజేశారు. మరో ఐదుగురికి సేవా రత్న, 25 మంది వలంటీర్లకు సేవా మిత్ర బహుమతులు అందజేశారు.

చంద్రబాబు వల్లే రూ.2.65 లక్షల కోట్ల అప్పులు

చంద్రబాబు రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని, ఆయన నిర్వాకం వల్లే రాష్ట్రానికి ఈ పరిస్థితి దాపురించిందని మంత్రి అన్నారు. విభజన చట్టం అమల్లో భాగంగా 2024 వరకు హైదరాబాద్‌పై మనకు అధికారం ఉన్నా, ఓటు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన బాబు కేసులకు భయపడి రాత్రికి రాత్రే ఆంధ్రకు వచ్చినట్లు వివరించారు. దీని ద్వారా మనకు సుమారుగా 2.65 కోట్ల రూపాయల నష్టం వచ్చిందన్నారు. తాత్కాలిక రాజధాని పేరిట ఇష్టానుసారంగా భవనాలను నిర్మాణాలు చేపట్టి అప్పుల పాలయ్యేందుకు కారణమయ్యారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, సిపాయి సుబ్రమణ్యం, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్, ఎంపీపీ అశ్విని, వరలక్ష్మీ, జెడ్పీటీసీలు కృష్ణమూర్తి, శరవణ, నాయకులు రామకృష్ణ ఉన్నారు.

ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో డీఎస్సీ 1998, 2008 టీచర్ల కౌన్సెలింగ్ శనివారంతో ముగిసిందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియను డీఈవో విజయేంద్రరావు, చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్, ఏడీ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. మొత్తం 678 మంది దీనికి హాజరైనట్లు అధికారులు తెలిపారు.

హాయ్ ఏపీ... బైబై బీపీ



మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : వారాహి యాత్రలో పవన్‌కళ్యాణ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపైన, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పైనా చేస్తున్న వ్యాఖ్యలకు మంత్రి ఆర్కే రోజా ఘాటుగా సమాధానమిచ్చారు. ఆమె శనివారం మీడియాతో మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ ఎక్కడకు వెళ్లినా బైబై చెబుతున్నారని పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రజలు ఆయనలా పూటకోమాట మార్చేవారు కాదన్నారు. వారు ఇప్పటికే స్థిరమైన నిర్ణయంతో ఉన్నారని హాయ్ ఏపీ.. బైబై బీపీ (బాబు, పవన్) అనుకుంటున్నారని చెప్పుకొచ్చారు. గుర్తు లేదు, 26 జిల్లాలకు అధ్యక్షులు లేరు. 175 నియోజకవర్గాలకు అభ్యర్థులు లేరు. ఆయనెలా జగన్నను ఓడించేస్తాడో.. ఎలా తరిమేస్తాడో ఎవరికీ అర్థం కావడం లేదని చెప్పారు. చంద్రబాబు అబద్ధాలు ప్రజలు వినీవినీ విసిగిపోయారని ఆయనను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కోవిడ్ లాంటి పరిస్థితిలో పొరుగు రాష్ట్రాలన్నీ ప్రజలను పట్టించుకోకపోతే, మన రాష్ట్రంలో మాత్రమే సరిపడే వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచి, సరైన వైద్యం అందించి ప్రజలకు అండగా నిలబడ్డారన్నారు. నాయకుడు ఎలా ఉండాలో తెలియజెప్పడానికి కోవిడ్ సమయంలో జగనన్న తీసుకున్న నిర్ణయాలే సాక్ష్యాలని మంత్రి వివరించారు.

చిట్స్ వ్యాపారి పరారీ

గంగవరం: పదేళ్ల పాటు చిట్స్ నిర్వహించిన వ్యాపారి ఉడాయించిన సంఘటన మండలంలో వెలుగులోకి వచ్చింది. మండలంలోని కీలపట్ల పంచాయతీ నల్లసానిపల్లెకు చెందిన సుబ్రమణ్యం కుమారుడు శంకరయ్య పదేళ్లకు పైగా చిట్స్ నిర్వహించేవాడు. పలమనేరు పట్టణం బజారు వీధిలోని ఓ అద్దె గదిలో జ్యోతిశంకర పేరుతో చిట్‌ఫండ్ కంపెనీ బోర్డు పెట్టాడు. ఈయన వద్ద ఇతర జిల్లాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన చిట్టీలు కట్టినవాళ్లు వంద మందికి పైగా ఉన్నారు. పలమనేరు, నల్లసానిపల్లి, తెట్టుమిట్ట, మేలుమాయి, గుండ్లపల్లి తదితర గ్రామాల్లో ప్రజల చేత లక్షల్లో చిట్టీలు కట్టించుకున్నాడు. ఈయన చిట్టీ వ్యాపారం ప్రారంభించిన కొత్తలో నాలుగు చిట్టీల వరకూ కట్టించుకోవడం అధిక వడ్డీతో తిరిగి చెల్లించడం లాంటివి చేయడంతో ప్రజలు బాగా నమ్మారు. ఆ తరువాత చిట్టీల డబ్బుతో గ్రామంలో దాదాపు రూ.50 లక్షలతో ఇంటి నిర్మాణం, పట్టణంలోని మారెమ్మ గుడి వీధిలో రూ.కోటికి పైగా వెచ్చించి చెప్పుల దుకాణం, పలుచోట్ల ఆస్తులు బాగా కూడేసినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ఆస్తులన్నింటినీ బినామీల పేరిట మార్చినట్టు సమాచారం. ఒక్కొక్కరికీ 10 లక్షలు, 11, 6, 9లక్షల చొప్పున చెల్లించాల్సి ఉందని బాధితులు చెబుతున్నారు. ఆరు నెలలుగా చిట్టీ డబ్బు కోసం బాధితులు శంకరయ్య ఇంటి వద్దకు వెళ్లగా, వాయిదాలు వేసుకుంటూ కాలం వెళ్లదీస్తూ వచ్చాడు. ఈ క్రమంలోనే నెల రోజుల క్రితం రాత్రికి రాత్రే ఇంటికి తాళం వేసుకుని కుటుంబంతో సహా పరారయ్యాడు. కొన్నాళ్ల పాటు పలుచోట్ల గాలించిన బాధితులు అతని జాడ దొరక్కపోవడంతో చేసేది లేక పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దీనిపై ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, నెల రోజుల క్రితం కేసు నమోదు చేసి శంకరయ్య కోసం గాలిస్తున్నామని తెలిపారు.

26న బదిలీల కౌన్సెలింగ్

చిత్తూరు అర్బన్: వార్డు సచివాలయ కార్యదర్శుల అంతర్ జిల్లాల బదిలీలకు సంబంధించి ఈనెల 26వ తేదీన నగరపాలక కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ అరుణ తెలిపారు. జిల్లాలోని వార్డు సచివాల యాలకు దరఖాస్తు చేసుకున్న కార్యదర్శులకు 26వ తేదీ కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు. వార్డు కార్యదర్శులు ఉదయం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

రూ.12 లక్షల జరిమానా

చిత్తూరు రూరల్: జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు రూ.12 లక్షల జరిమానా విధించినట్లు డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గుడిపాల, నరహరిపేట, గాదంకి చెక్‌పోస్టులో శుక్రవారం ప్రైవేటు బస్సులపై ఆర్టీఓ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, పన్ను చెల్లించని 8 బస్సులు, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 15 వాహనాలకు రూ.12 లక్షలు జరిమానా విధించారు. అక్రమంగా నడుపుతున్న వెంకటరమణ బస్సును సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

30న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ కానుకలు ఈ నెల 30వ తేదీ లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి స్వామివారి ఆస్థాన మండపంలో హుండీ కానుకల లెక్కింపుకు ఆలయ సిబ్బంది అందరూ హాజరు కావాలని కోరారు.